## కాటేదాన్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రజలకు అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులకు, అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## అరుణజ్యోతికి దళితరత్న అవార్డు

మణికొండ: దళితజ్యోతి అభ్యున్నతికి, వారిలో స్ఫూర్తి నింపే పనులను చేసిన వారికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ తరపున ఇచ్చే దళితరత్న అవార్డును నార్సింగి మాజీ వార్డు సభ్యురాలు పత్తి అరుణజ్యోతికి దక్కింది. నార్సింగిలో అంబేడ్కర్ భవనం ముందు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, గ్రామంలోని దళితుల అభివృద్ధికి కృషి చేయటంతో ఆమెకు అవార్డు దక్కింది. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య ఆమెకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను నార్సింగి వాసులు పెద్ద ఎత్తున అభినందించారు.

## రక్తదాన శిబిరం



రేతిగల్లిలో రక్తదాన చేస్తున్న పోలీసులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలకు యువత ఉత్సాహంగా ముందుకువస్తున్నారని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు అన్నారు. గోల్కొండ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం రేతిగల్లీ జీఎంకే ప్రైడ్ ఫంక్షన్‌హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా రక్తదానం చేయడానికి గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిబ్బంది రావడాన్ని ఆయన అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో 220 మంది రక్తాన్ని దానం చేశారు. ఈ విధంగా వచ్చిన రక్తాన్ని నిలోఫర్ ఆసుపత్రి వారికి అందించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డీఐ రాజేశ్వర్‌ప్రసాద్, అడ్మిన్ ఎస్సై శ్రీలత, డీఎస్సై మహ్మద్ రఫీక్, పీస్ కమిటీ సభ్యులు ఆబేద్, అక్బర్, లక్ష్మీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. నియోజకవర్గంలో నిరుపేదలు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి సంక్షేమ పథకాల వల్ల ప్రయోజనం పొందారన్నారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో మహిళల కోసం స్వయం ఉపాధికి పనికి వచ్చే వివిధ రకాల కోర్సులు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆయన వెంట సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

## వర్గీకరణ జీవో కాపీని సీఎంకు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ జీవోను వర్గీకరణ సబ్ కమిటీ బృందం సీఎం రేవంత్ రెడ్డికి ఇవ్వడాన్ని మాదిగ సమాజం స్వాగతిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. జీవో కాపీని మంద కృష్ణ మాదిగకు ఇవ్వొద్దన్నారు. సోమవారం పిడమర్తి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టిన సూటు బూటు, బ్లూ షర్ట్స్, జై భీమ్ ర్యాలీని మలక్‌పేట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే షేక్ అక్బర్ ప్రారంభించారు.

# జై భీమ్..

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ జయంత్యోత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులు, వివిధ సంస్థల నిర్వాహకులు అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



రాజేంద్రనగర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



అత్తాపూర్ పరిధిలో...



హైదర్షాకోట్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



హిమాయత్‌సాగర్‌లో కమిషనర్ శరత్‌చంద్ర



బీజేపీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



మణికొండ శివాజీనగర్‌లో...



శంషాబాద్‌లో రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ చైర్మన్, మాజీ సర్పంచ్



శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో...



నార్సింగిలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్



ఖానాపూర్‌లో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్



కోకాపేటలో బీజేపీ, ఎమ్మార్పీఎస్ నేతలు



నార్సింగిలో సీపీఐ నాయకులు



మైలార్‌దేవ్‌పల్లి వాంబే కాలనీలో ...



కాటేదాన్ బీజేపీ కార్యాలయంలో...



శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో...



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయలంలో...



హైదర్‌గూడ బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో...

## విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతి విద్యార్థికి కంప్యూటర్ అవగాహన అత్యంత అవసరం అని తెలంగాణ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు ఏర్వ సత్యనారాయణ, కార్యదర్శి కాశీగారి యాదగిరి అన్నారు. నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లిలోని భావన ఋషి కాలనీలోని శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరం ద్వారా యువతలో నైపుణ్యాన్ని పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపడతాయన్నారు. ప్రాథమిక కంప్యూటర్ కోర్సులతో పాటు, డాస్, విండోస్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ కో పైలట్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమవుతాయన్నారు. ఔత్సాహికులు ఫోన్స్: 96662 22759, 85209 08740, 70753 64515లలో సంప్రదించాలని కోరారు.

## పార్కు స్థలాన్ని చదును చేసిన వ్యక్తిపై కేసు నమోదు

రాజేంద్రనగర్: పార్కు స్థలాన్ని చదును చేసిన వ్యక్తిపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పురా భవానీ కాలనీలో గతంలో లకన్ సింగ్ అనే వ్యక్తి వెంచర్ చేసి 1000 గజాల పార్కు స్థలాన్ని వదిలారు. కాలనీ ప్రజలు ఈ పార్కు స్థలాన్ని అభివృద్ధి పరుచుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ స్థలం విలువలు పెరిగిపోవడంతో సోమవారం ఉదయం జేసీబీతో లకన్ సింగ్ పార్కు స్థలం వద్దకు వచ్చాడు. జేసీబీతో చదును చేస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు లకన్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని జేసీబీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు శ్రీపోచమ్మ ఆలయ వార్షిక వేడుకలు

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో కొలువుదీరిన శ్రీపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 16న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు మహా గణపతిపూజ, 10 గంటలకు హోమం, 11 గంటలకు అభిషేకం, 12.30 గంటలకు కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

# వైభవంగా మండల పూజ

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం 51వ రోజు మండల పూజా కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ గణపతి వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి శివ పంచాయతీని ద్వాదశ జ్యోతిర్లింగం సంతోషిమాత విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేసి 501 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో మండల పూజ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు దేవతామూర్తుల అభిషేకాలు, అలంకరణ అనంతరం హారతి, 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాంగ ప్రాసన, నవగ్రహ ఆరాధన, 9 గంటలకు గణపతి హోమం, నవగ్రహం హోమం, రుద్ర హోమం, చండీ హోమం, బలి ప్రదానం, పూర్ణాహుతి, శివ పార్వతుల కల్యాణం, ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు.



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

## ముగిసిన కుస్తీ పోటీలు



గన్‌ఫౌండ్రీ: ఆధునిక క్రీడలు ఎన్ని పుట్టుకువచ్చినా కుస్తీ పోటీలకు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలు అన్నారు. మూడు రోజులుగా ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న 3వ మహావీర్ తెలంగాణ కేసరి కుస్తీ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో నగరానికి చెందిన ముస్తఫా బిన్ అలీ విజేతగా నిలవగా, సాయికిరణ్, కేఎల్ యాదవ్‌లు 2వ బహుమతిని అందుకున్నారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు భారీ గదను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కుస్తీ అనేది ఒక యుద్ధ కళ అన్నారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 440 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ నాయకులు చిన్న శ్రీశైలంయాదవ్, నవీన్ యాదవ్, నిర్వాహకులు మెట్లు శివ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులను అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటే: ఎమ్మెల్సీ కవిత

ఖైరతాబాద్: మహనీయులను అవమానించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవిత పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాగర తీరంలో 125 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏ మాత్రం పట్టించుకోలేనది విమర్శించారు. మంత్రులు అంబేడ్కర్ జయంతి సందర్భంగా వచ్చారు కానీ ముఖ్యమంత్రి రాలేదన్నారు. కార్యక్రమంలో బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రవతి, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్, జూబ్లీహిల్, వెంకటేశ్వర కాలనీల కార్పొరేటర్లు మన్నె కవిత, వెల్దండ వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు గజ్జల ఆనంద్, జాగృతి నగర కో కన్వీనర్ తేజా చౌదరి, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత తదితరులు

**కవితను అడ్డుకున్న పోలీసులు...**

125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సందర్శించేందుకు వెళ్లిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. కవిత అక్కడే జై భీం అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని మృతదేహం లభించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 25–30 సంవత్సరాలు ఉంటుందని... మృతుడి ఒంటిపై బ్లూ కలర్ ప్యాంట్, బ్లూ కలర్ షర్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులకు కానీ ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## తెలుగు భాషను రక్షించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో తెలుగు భాష కనుమరుగవుతున్న విధానం చూస్తుంటే ఆందోళన కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల సూత్రదారి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవ కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలుగు భాషను రక్షించుకునేందుకు ప్రభుత్వాలతో పాటు సాంస్కృతిక సంస్థలు కూడా నడుంబిగించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు పాడనా తెలుగు పాట పేరిట నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు ఆచార్య కొలకలూరి ఇనాంక్, ఎల్లా వెంకటేశ్వరరావు, అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

# రెండోరోజూ మృతి చెందిన చేపలు



గోపన్‌పల్లిచిన్నాపెద్ద చెరువులో మృత్యువాత పడిన చేపలు



చెరువును పరిశీలిస్తున్న ముదిరాజ్‌సంఘం సభ్యులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిన్నపెద్ద చెరువులో సోమవారం (రెండోరోజూ) మరిన్ని చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు చెరువులో చేరడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముదిరాజ్‌సంఘం ప్రతినిధులు గోపన్‌పల్లిలోని చిన్నాపెద్ద చెరువును సందర్శించారు. తాము పడ్డ కష్టమంతా నీళ్లపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

**గోపన్‌పల్లిచెరువును పట్టించుకోరా?**

గోపన్‌పల్లి చెరువును అధికారులు పట్టించుకోరా...? అని ముదిరాజ్ సంఘం గోపన్‌పల్లి అధ్యక్షుడు శంకరి రాజుముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గోపన్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ 25క్వింటాళ్ల చేపలు మృగశిర కోసం పెంచామని, మొదటిసారి 10 క్వింటాళ్ల చేపలు చనిపోయాయని, తాజాగా 15 క్వింటాళ్ల చేపలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలు పెంపకమే జీవనంగా సాగిస్తున్నామని, మాకు వేరే ఇతర ఆధారం లేదన్నారు. చాలా నష్టపోయామని ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే జరిగిందన్నారు. మొదటిసారి జరిగినప్పుడు స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే మరింత నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా మురుగునీరంతా చెరువులో చేరుతోందని, అయినా అధికారులు నిమ్మకనీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మురుగునీరు చెరువులో చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గోపన్‌పల్లి సభ్యులు పాల్గొన్నారు.

# పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ





స్టడీ మెటీరియల్ అందజేసిన తపస్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: పేద విద్యార్థులను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులందరూ ప్రయత్నించాలని అదే మనం అంబేద్కర్‌కు ఇచ్చే గొప్ప నివాళి అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తపస్ యూత్ ఫర్ సేవ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో పాలిసెట్–25కు హాజరవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 96 మంది విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహించి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా జీవితంలో తొందరగా స్థిరపడవచ్చని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. తపస్ జిల్లా అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు అనిత, రజనీకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్, నేతలు కళావతి, ఉషారాణి, లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, కాశీరావు, పండరి, రజని, వీర కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.